ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
3★★★ జిల్లా వార్తలు
సోమవారం 19 మే 2025





పాత బకాయిలు లేనట్లేనా..?

● ఐదేళ్లుగా పాత వడ్డీ కోసం స్వశక్తి మహిళల ఎదురుచూపులు

● గత ప్రభుత్వ హయాంలో రూ.68.66 కోట్ల బకాయిలు

● కాంగ్రెస్ సర్కార్ కొత్త వడ్డీకే పరిమితం ● ఇప్పటికి రెండు విడతలుగా రూ.8.37కోట్లు విడుదల

మండలాల వారీగా రావాల్సిన పాత వడ్డీ రాయితీ బకాయిలు(లక్షల్లో)					
మండలం	2020-21	2021-22	2022-23	సంఘాలు	మొత్తం
బోయినపల్లి	178.99	209.51	177.39	792	575.89
చందుర్తి	131.73	185.57	161.73	712	479.03
ఇల్లంతకుంట	253.56	316.83	278.97	1,145	849.36
గంభీరావుపేట	230.93	288.59	285.13	1191	804.65
కోనరావుపేట	152.69	229.63	178.60	1038	560.92
ముస్తాబాద్	276.82	301.01	247.12	1,124	824.95
రుద్రంగి	58.91	66.92	68.40	368	194.23
తంగళ్లపల్లి	263.75	300.97	246.70	1,145	811.42
వీర్నపల్లి	53.94	72.39	66.55	303	192.88
వేములవాడ	65.09	100.84	86.04	361	251.97
వేములవాడరూరల్	113.13	130.24	118.75	544	362.12
ఎల్లారెడ్డిపేట	277.73	375.63	305.80	1,037	959.16
మొత్తం	2067.27	2578.13	2221.18	9,755	6,866.58

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సిరిసిల్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు లింకేజీ రుణాల వడ్డీ రాయితీ బకాయిలు రాకపోవడంతో స్వశక్తి పొదుపు సంఘాల మహిళలకు నిరాశే మిగులుతోంది. గత ప్రభుత్వ హయాం నుంచి బ్యాంక్ లింకేజీ రుణాలకు సంబంధించిన వడ్డీ రాయితీ కోసం మహిళా సంఘాల సభ్యులు ఎదురుచూస్తున్నారు. తాజా కాంగ్రెస్ సర్కార్ స్వశక్తి సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధిపై దృష్టి సారించి మహిళా శక్తి పథకం ద్వారా పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇదే క్రమంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మహిళా సంఘాలకు రెండు విడతలుగా రూ.8.37 కోట్లు విడుదల చేసింది. పాత బకాయిలు కూడా ఏదో సందర్భంలో ప్రభుత్వం విడుదల చేస్తుందని స్వశక్తి మహిళలు భావించారు. అయితే ప్రభుత్వం ఆ ఊసే ఎత్తకపోవడంతో పాత బకాయిలు లేనట్టేనా..? అనే సందిగ్ధం ఏర్పడింది. గత ప్రభుత్వ హయాంలో వడ్డీ విడుదల కోసం ఐదేళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వడ్డీ రాయితీ చెల్లిస్తుందని భావించినా తమ హయాంలోని బకాయిలు మాత్రమే విడుదల చేస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు.

● బకాయిలు కోసం నిరీక్షణ

ప్రభుత్వం నుంచి రావాల్సిన వడ్డీ రాయితీ కోసం మహిళా సంఘాల సభ్యులకు నిరీక్షణ తప్పడం లేదు. పాత బకాయిల జోలికి కొత్త ప్రభుత్వం వెళ్లకపోవడంతో మహిళా సంఘాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 2020-21 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన వడ్డీ రాయితీ బకాయి రూ.68.66 కోట్లకు చేరుకుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 9,963 స్వశక్తి సంఘాలు, 411 గ్రామసంఘాలు, 12 మండల సంఘాలు, వీటికి అనుసంధానం చేస్తూ జిల్లా సమాఖ్య కూడా పనిచేస్తోంది. స్వశక్తి సంఘాల పరిధిలో 1,12,637 మంది సభ్యులు ఉన్నారు. వీరికి ప్రతి సంవత్సరం కోట్లలోనే వడ్డీలేని రుణాలను అందిస్తూ గ్రామీణాభివృద్ధి సంస్థ ముందంజలో నిలుస్తోంది. స్వశక్తి సంఘాలకు బ్యాంక్ లింకేజీ అందించడంలో ఇబ్బందులు లేకపోయినా వడ్డీ రాయితీ మాత్రమే భారంగా మారింది.

గత ప్రభుత్వ హయాంలో 9,755 స్వశక్తి సంఘాలకు రూ.68.66 కోట్లు వడ్డీ రాయితీ రావాల్సి ఉంది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో 9,051 సంఘాలకు రూ 20.67 కోట్లు రాయితీ రావాల్సి ఉంది. 2021-22లో 9,001 సంఘాలకు రూ.25.78 కోట్లు, 2022-23లో 9,755 సంఘాలకు రూ.22.21 కోట్లు వడ్డీ రాయితీ రావాల్సి ఉంది.

జిల్లా కేంద్రంలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు..
- 6 ఎకరాల్లో 2 వేల మంది కూర్చుండేలా ఏర్పాట్లు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

6



భక్తులతో కోలాహలంగా మారిన రాజన్న ఆలయ ప్రాంగణం

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ..
- స్వామి వారి దర్శనానికి రెండు గంటల సమయం
- రాజన్న సేవలో మహానాథ్ మహేంద్ర దాస్‌జీ
5

రైతులు, వ్యాపారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రైతుతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : రైతు బజార్‌లోని రైతులు, చిరు వ్యాపారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ప్రభుత్వ విప్ ఆది ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణంలోని రైతు బజార్, జిల్లా గ్రంథాలయం ఆవరణలో మహాత్మా జ్యోతిబా ఫూలే విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. రైతు బజార్‌లో పర్యటిస్తూ రైతులు, వ్యాపారులతో మమేకమై వారి సమస్యలను ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కూరగాయలు పండించే రైతులు, కూరగాయాల విక్రేతలకు సౌకర్యంగా ఉండేలా షెడ్లు నిర్మిస్తామని రైతు బజార్‌లో అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ నాగుల సత్యనారాయణ, ఆర్డీవో వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జి కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దుబాల వెంకటేశం, ఎండీ ఖాజా, ఆడెపు జగన్, నక్క నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, కుడిక్యాల రవికుమార్, వేముల రవి, వెంగళ లక్ష్మీనర్సయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా బాలయ్య



కోయినేని బాలయ్య, సోమినేని మహేష్

వేములవాడ, మే 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడుగా కోయినేని బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా సోమినేని మహేష్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం సంఘం నాయకులు సమావేశమై వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల కమిటీ సభ్యులు చిలుక రమేష్, రామతీర్థపు రాజు నూతన, అధ్యక్ష కార్యదర్శులు నియామక పత్రాలు ఎలక్షన్ కమిటీ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1977లో ఏర్పాటు అయిన మున్నూరు కాపు సంఘం క్రమంగా అభివృద్ధి చెందుతూ వస్తున్నదని, కాపు కల్యాణ మండపం నిర్మాణం దాదాపు 60 శాతం పూర్తయిందని, ఇంకా 40శాతం కావాల్సి ఉందని, సంఘం సభ్యుల సహకారంతో త్వరలోనే పూర్తిచేస్తామని తెలిపారు. కల్యాణ మండపం నిర్మాణానికి వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌లు పూర్తిగా సహకరించారని గుర్తు చేశారు. త్వరలోనే కార్యవర్గం విస్తరించి అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు నామాల పోచెట్టి, రైకనపాట క్రాంతికుమార్, బింగి శ్రీనివాస్, గోపు బాలరాజు, వరాల దేవయ్య, నామాల లక్ష్మీరాజాం, తొగరి కరుణాకర్, బింగి మహేష్, కోయినేని శ్రీనివాస్, సగ్గు దేవరాజు, ఉపేందర్, లక్ష్మీనారాయణ, శేఖర్, దేవరాజ్, బోనాల శివ, కవ్వల సురేందర్, చిలుక రవి, తొగరి వెంకటేష్, చిలుక గట్టు, వరాల సురేష్, దాది అశోక్, కుల సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన వసతుల కల్పనే లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



అగ్రహారం అంజన్న ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ

వేములవాడ కల్చరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజన్న ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలకు వచ్చే భక్తులకు మెరుగైన వసతుల కల్పనే లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలంలోని అగ్రహారం హనుమాన్ ఆలయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝూతో కలిసి రూ. 31 లక్షలతో ఆలయ ప్రాకార గోడ, ఆర్చి నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆది శ్రీనివాస్‌కు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజన్న ఆలయానికి వచ్చే భక్తులు అంజనేయ స్వామిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి, పట్టణాభివృద్ధి, శ్రీజోడాంజనేయస్వామి అభివృద్ధి చేసుకుంటూ ముందుకు పోతున్నామని అన్నారు. అంజన్న ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నూతన గ్రానైట్ వేయాలని నిర్ణయించడం జరిగిందని, రానున్న రోజుల్లో దశలవారీగా ఆంజనేయ స్వామి ఆలయం అభివృద్ధి చేస్తామన్నారు. ఇటీవల నాంపల్లి లక్ష్మీనరసింహస్వామి కల్యాణానికి వెళ్లినప్పుడు మూడు అంతస్తుల గోపురం కావాలని వారు కోరారని తెలిపారు. త్వరలోనే స్వామివారి సన్నిధిలో మూడంతస్తుల గోపురం నిర్మిస్తామని హామీచ్చారు. మామిడిపల్లి సీతారామచంద్ర ఆలయ ఆవరణలో కల్యాణ మండపం నిర్మించాలని నిర్ణయించామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేవాలయంలో మెరుగైన వసతలు కల్పించడం లక్ష్యంగా అన్ని ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.150 కోట్ల పైచిలుకు నిధులతో రాజన్న ఆలయ, పట్టణాభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే రూ.47కోట్లు కలెక్టర్ ఖాతాలో జమ అయ్యి ఉన్నాయని తెలిపారు. అంతే కాకుండా రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు రూ.76 కోట్లతో అన్నదాన సత్రం నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని అన్నారు. రాజన్న భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆలయం అభివృద్ధి చేస్తున్నామని, అందరి సలహాలు, సూచనలు స్వీకరిస్తూ ముందుకు పోతున్నామన్నారు. శృంగేరి పీఠం వారు, పట్టణ ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల వారు, ఆలయ పరిరక్షణ సమితి సభ్యుల సూచనలు సలహాలు స్వీకరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, అనువంశిక ఆలయ ధర్మకర్త గౌరిశెట్టి మహేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య ఉన్నారు.

భారత సైన్యానికి దేశవ్యాప్తంగా ప్రజల జేజేలు

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



ఆర్మీ జవాన్‌ను అభినందిస్తున్న బండి సంజయ్

ఇల్లంతకుంట, మే 18 (ఆంధ్రజ్యోతి) : భారత సైన్యానికి దేశవ్యాప్తంగా ప్రజలు జేజేలు పలుకుతున్నారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన అంతటి అనీల్ అపరేషన్ సిందూర్‌లో పాల్గొని ఆదివారం స్వగ్రామం అయిన ఇల్లంతకుంటకు వస్తుండగా కేంద్రహోంశాఖ మంత్రి వంతడుపుల గ్రామంలో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా తన సత్తాను నిరూపించుకుందన్నారు. ఉగ్రవాద మూలాలు లేకుండా చేయాలన్నదే భారత ప్రభుత్వ సంకల్పం అన్నారు. పాకిస్తాన్ ఏయిర్‌బేస్‌లపై దాడులు చేయడంతో మూడు రోజుల్లోనే కాళ్ల బేరానికి వచ్చిందన్నారు. ఎన్డీయే అధికారంలోకి వచ్చినప్పటి నుండి రక్షణ రంగానికి నిధుల కేటాయింపు పెంచుతు వస్తుందన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో 13.45శాతం నిధులను రక్షణ రంగానికి కేటాయించిందని పేర్కొన్నారు. భారత రక్షణ రంగానికి మరింత ఊతం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ఇల్లంతకుంటకు చెందిన అనీల్ భాగస్వామి అవడం అదృష్టం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, రాష్ట్రనాయకుడు సొల్లు అజయ్‌వర్మ, మండల అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్, మాజీ అధ్యక్షుడు నాగసముద్రాల సంతోష్, నాయకులు అన్నల్‌దాస్ వేణు, మ్యాకల మల్లేశం, బాల్‌రెడ్డి, సాయగౌడ్, అనీల్, చిమ్మనగొట్టు శ్రీనివాస్, నరేష్, వజ్జపల్లి శ్రీకాంత్, బత్తిని స్వామి, గుంటి మహేష్, రవీందర్‌రెడ్డి, సాయిప్రసాద్, సంతోష్‌లతో పాటు వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం..

మండలంలోని వంతడుపుల గ్రామంలో బీజేపీ నాయకుడు నవీన్ వివాహ వేడుకలలో కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. మండలానికి వచ్చిన సంజయ్‌కుమార్‌కు బీజేపీ నాయకులు పొత్తూరు గ్రామంలో ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా మండలంలోని పలు సమస్యలు వివరించగా కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు పేర్కొన్నారు.

కంచర్లలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

వీర్నపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం డాక్టర్ సారియా అంజుమ్ వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసినారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 26 అనుమానిత జ్వరపీడుతులను గుర్తించి చికిత్స అందించి వారికి ఎలిసా టెస్ట్ చేయించగా, 2 డెంగ్యూ వ్యాధి జ్వరం నిర్ధారణ జరిగింది. ఇంటి ఇంటి సర్వే నిర్వహించి లార్వాలను తొలగించడం జరిగిందని, అనుమానిత జ్వరపీడితుల 26 గుర్తించిన ఇళ్లలో ఐఆర్‌ఎస్ స్ప్రే, లార్వాలను తొలగించడం, ఫాగింగ్ చేయించారు. జ్వర పీడితులకు మందులను పంపిణీ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చందుర్తి,మే 18 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం సనుగుల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008-2009 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సమ్మేళనం ఆదివారం జరిగింది. 17 సంవత్సరాల కిందట తాము చదువుకున్న పాఠశాలలో ఒకే వేదికపై కలుసుకోవాలన్న ఆలోచనతో గత కొద్ది రోజుల నుంచే పూర్వ విద్యార్థులు ప్రణాళిక రూపొందించుకొన్నారు. ఈ సందర్భంగా తమకు విద్య బోధించిన గురువులను మెమొంటోలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. బాల్యంలో తాము చదువుకున్న పాఠశాలలో తీపి గుర్తులను వేసుకున్నారు. అప్పటి బాల్య స్నేహితులు తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు ఎక్కడెక్కడో స్థిరపడిన పలువురు పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకోవడం ఎంతగానో ఆనందాన్ని ఇచ్చిందని తమ ఉపన్యాసాలలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక సదుపాయాలకు ఆర్థిక సహాయం అందజేస్తామని పలువురు పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్

ఎల్లారెడ్డిపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి బస్టాండు ప్రాంతంలో ఆదివారం సైబర్ నేరాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజలు గుర్తు తెలియని నంబర్ నుంచి లింక్‌లు, మెసెజ్‌లు వస్తే స్పందించకూడదని అన్నారు. పరిచయం లేని వ్యక్తులకు తమ పూర్తి వివరాలను వెల్లడించకూడదని అన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించాలని అన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. చిన్నారులు, యువతులు, మహిళలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

హిందూ ఏక్తా యాత్రను విజయవంతం చేయాలి

కోనరావుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తలపెట్టిన హిందూ ఏక్తాయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మిరియాలుకార్ బాలాజీ అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో హిందూ ఏక్తాయాత్ర సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల హిందూ ప్రజలు పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 22న కరీంనగర్‌లో ప్రారంభం అవుతుందని అన్నారు. ఈ సమావేశంలో కిష్టస్వామి తీగల రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME
★ I, "DASAM SREEKANTH" S/O. DASAM SUDHAKAR R/O. H.NO: 5-20/1, ALUGUNUR, THIMMAPUR, KARIMNAGAR, I HAVE CHANGED MY NAME AS "DASAM SRIKANTH" S/O. DASAM SUDHAKAR.
AJK-16800

CHANGE OF NAME
★ I, "JAPA RAVINDRA REDDY" S/O. JAPA MALLA REDDY, R/O. H.NO: 4-70, ALUGUNUR, THIMMAPUR, KARIMNAGAR, I HAVE CHANGED MY NAME AS "JAPA RAVINDER REDDY" S/O. JAPA MALLAREDDY.
AJK-16800

CHANGE OF NAME
★ I, GOLI LAXMI, W/O. GOLI BHAGAVAN REDDY, R/O. H.NO. 10-3-23, VIDYA NAGAR, KARIMNAGAR HAVE CHANGED MY NAME AS "GOLI VIJAYA" W/O. GOLI BHAGAVAN REDDY
AJK-16800

కావలెను
★ హన్మకొండ స్వచ్ఛంద సంస్థ నందు వాచ్‌మెన్ కావలెను. ఉచిత వసతి + భోజనం కల్పించబడును. సం॥ప్ర॥ 8074465703, 9849038142
AJW-15652

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

3+2 స్కీం కలదు

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్: 9703618691, 9985410640
జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్: 99854 11262
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063
పెద్దపల్లి :- 95509 00238

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


తిరుపతిరెడ్డి(ఫైల్)

సైదాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయికల్ గ్రామానికి చెందిన రావుల తిరుపతిరెడ్డి(38) అనేరైతు ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొన్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలప్రకారం.. శనివారం రాత్రి తిరుపతిరెడ్డి భార్య పిల్లలు, ఇంటి బయట పడుకున్నారు. తిరుపతిరెడ్డి మాత్రం ఇంట్లోని బెడ్‌రూంలో కూలరు వేసుకొని పడుకున్నాడు. ఉదయం అతని భార్య కవిత లేచి తలుపు దగ్గరకు వెళ్లి ఎంత పిలిచినా లేవలేదు. ఫోన్ చేసిన ఎత్తలేదు. దీంతో తలుపులను బలంగా తన్నడంతో తలుపులు తెరుచుకున్నాయి. లోపలికి వెళ్లి చూసేసరికి తిరుపతిరెడ్డి చీరతో దూలానికి ఉరి వేసుకొని చనిపోయి ఉన్నాడని వారు తెలిపారు. తమకు 2.20ఎకరాల భూమి ఉన్నదని, వ్యవసాయం చేసుకొని జీవిస్తుంటామని తిరుపతి రెడ్డి భార్య కవిత పేర్కొంది. వ్యవసాయం కోసం సుమారు 10లక్షల వరకు అప్పు అయిందని అన్నారు. దీనికి తోడు ఇద్దరు ఆడ పిల్లలున్నారని అప్పులు ఎలా తీర్చాలనే మనస్థాపంతోనే తన భర్త మృతి చెందాడని కవిత తెలిపారు. ఈ మేరకు మృతుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జీ ఎస్సై భార్గవ్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత బలవన్మరణం

ఎల్లారెడ్డిపేట, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఓవైపు భర్త అనారోగ్యం.. మరో వైపు ఆర్థికఇబ్బందులు తట్టుకోలేక మనస్థాపం చెందిన వివాహిత నరెడ్ల స్వప్న(32) ఉరి వేసుకుని బలవన్మరణానికి ఒడిగట్టింది. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని స్వప్న భర్త సత్యం ద్విచక్రవాహన మెకానిక్‌గా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. యేడాది కిందట అనారోగ్యానికి గురయ్యాడు. దాంతో కుటుంబ పోషణ భారం స్వప్నపై పడింది. భార్యభర్తల నడుమ మనస్పార్థాలు నెలకొనడంతో స్వప్న పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. రెండు నెలల కిందట గ్రామానికి చేరుకున్న ఆమె భర్త అనారోగ్యంతో బాధ పడుతుండడం.. పిల్లల పోషణకు ఆర్థిక ఇబ్బందులతో సతమతమైంది. మనస్థాపం చెందిన స్వప్న గదిలోని వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన ఆమె కూతురు సాత్విక భయంతో కేకలు వేస్తూ చుట్టుపక్కల వారికి చెప్పింది. అక్కడకు చేరుకున్న చుట్టుపక్కల వారు మృతదేహాన్ని కిందకు దింపారు. ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని లక్ష్మణ్ వివరించారు. మృతురాలికి భర్త సత్యం, కొడుకు సన్నిహిత్, కూతురు సాత్విక ఉన్నారు.

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య


ముత్తయ్య(ఫైల్)

చందుర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యం, ఒంటరితనం ఆరోగ్య సమస్యలతో పాటు కంటిచూపు మందగించడంతో ఓ వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొండ ముత్తయ్య (65) ఒంటరి తనం, అనారోగ్య సమస్యలతో పాటు కంటి చూపు మందగించడంతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య పది సంవత్సరాల క్రితం మృతిచెందింది. రెండో కుమారుడు మధు డ్రగ్స్‌కు అలవాటు పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెద్ద కుమారుడు స్వామి సౌదీ వెళ్లాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

ధాన్యం కుప్పలను ఢీకొని ఒకరి మృతి


రంజిత్‌కిరణ్ (ఫైల్)

తిమ్మాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపైన రైతులు ఆరబోసిన దాన్యం కుప్పలను ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన సంఘటన మండలంలోని మల్లాపూర్‌లో చోటుచేసుకుంది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన నేరెళ్ల రంజిత్‌కిరణ్(32) తన స్నేహితుడు సాజిద్‌తో కలిసి మల్లాపూర్‌లోని స్నేహితుడిని కలిసేందుకు శనివారం సాయంత్రం బైక్‌పై వచ్చారు. తిరిగి అర్ధరాత్రి కరీంనగర్‌కు వెళుతుండగా మల్లాపూర్ గ్రామానికి చెందిన మామిడిసతీష్ అనేరైతు రోడ్డుపై పోసిన ధాన్యం కుప్ప కనిపించక దానిని ఢీకొట్టారు. దీంతో బైక్ అదుపుతప్పి కిందపడడంతో రంజిత్‌కిరణ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సాజిద్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కరీంనగర్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య రితిక ఫిర్యాదు మేరకు రైతు మామిడి సతీష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని సీఐ సదన్ కుమార్ సందర్శించి రైతులు రోడ్డుపై ధాన్యం ఆరపోయవద్దని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

సుల్తానాబాద్, మే 18: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుగ్లాంపల్లి గ్రామంవద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. సుగ్లాంపల్లి వద్ద నుంచి రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వస్తుండగా పెద్దపల్లి నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ట్రాలీవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అయితే ప్రమాదానికి కారణమైన ట్రాలీ ఆపకుండా వెళ్తుండగా సుగ్లాంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఈర్ల వెంకటేశ్వర్లు ద్విచక్ర వాహనంపై వెంబడించి ట్రాలీని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతుడు మతిస్థిమితంలేని వ్యక్తిగా భావిస్తున్నారు. ప్రమాదానికి కారకుడైన ట్రాలీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ట్రాలీని కూడా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

యువజన సంఘాలకు ఆదరణ కరువు

- కార్యక్రమాల్లో భాగస్వాములను చేయని నెహ్రూ యువ కేంద్రం
- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులను సాధించిన వారినీ పట్టించుకోని వైనం



గణేశ్‌నగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యువజన సంఘాలు చురుకుగా పని చేసేవి. నెహ్రూ యువ కేంద్రం (ఎన్‌వైకే) ఆధ్వర్యంలో సంవత్సరం పొడువునా కార్య క్రమాలు నిర్వహించేవారు. రాను రాను కార్యక్రమా లు తగ్గిపోయాయి. ఒకప్పుడు సందడిగా ఉండే ఎన్‌వైకే ఇప్పుడు నిర్మానుష్యంగా మారింది.

● నామమాత్రంగా కార్యక్రమాలు

గ్రామీణ ప్రాంతంలోని యువతీ, యువకులను, యువజన సంఘాల సభ్యులను జాతి నిర్మాణంలో పాల్గొనేలా అవకాశాలను కల్పించేందుకు నెహ్రూ యువ కేంద్రాలను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేశారు. కరీంనగర్‌లో 1988లో నెహ్రూ యువ కేంద్రం ఏర్పాటు చేశారు. ఘన చరిత్ర ఉన్న కరీంనగర్ నెహ్రూ యువ కేంద్రం దశాబ్ద కాలంగా నామమాత్రంగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. గ్రామీణ ప్రాంత యువజన సంఘాలను సమన్వయం పరచడం, యువజన సాధికారతపై దృష్టి కేంద్రీకరించడం లేదు. గతంలో యువజన ఉత్సవాలు ఘనంగా నిర్వహించేవారు. ఉమ్మడి జిల్లా నుంచి పలువురు ఉత్సవాల్లో పాల్గొని జిల్లాస్థాయి, రాష్ట్ర జాతీయ స్థాయిల్లో అవార్డులు అందుకున్నారు. ప్రస్తుతం ఆ కార్యక్రమాలేవీ నిర్వహించడం లేదు. సంవత్సరంలో ఒకటి, రెండు కార్యక్రమాలను నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. వాటిలోనూ యువజన కేంద్రాలకు భాగస్వామ్యం కల్పించడం లేదు.

● కోర్సుల ఊసే లేదు...

నెహ్రూ యువ కేంద్రంలో కుట్టు మిషన్, టైలరింగ్, బ్యూటీషన్ కోర్సులు నిర్వహించేవారు. ప్రస్తుతం అవి మచ్చుకైనాఆ లేదు. కలెక్టర్ ఈ విషయంపై దృష్టి సారించాలని యువజన సంఘాల నేతలు కోరుతున్నారు. యువజన సంఘాల సారథ్యంలో క్రీడా పోటీలను బ్లాక్, జిల్లా స్థాయిలో పోటీలను గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించేవారు. ప్రస్తుతం అవి కనుమరుగయ్యాయి.

● నాయకులకు ప్రాధాన్యం కరువు

సామాజిక సేవే పరమావధిగా తమ జీవితాలను పణంగా పెట్టి జిల్లాలోని పలువురు యువజన సంఘాల నాయకులు నెహ్రూ యువ కేంద్రానికి అనుబంధంగా పనిచేశారు. యువజన చైతన్య సదస్సులు, శ్రమదానం, మొక్కలు నాటడం వంటి స్వచ్ఛంద సేవ, స్వయంసేవా లాంటి కార్యక్రమాలతో పాటు యువజన సంఘ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. జిల్లాకు రాష్ట్ర, జాతీయ స్థాయిలలో సామాజిక సేవా విభాగంలో ఉత్తమ యువజన అవార్డులు తెచ్చిపెట్టారు. ఇప్పుడు తమను పట్టించుకునే వారేలేరనివారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● వార్షిక ప్రణాళిక మాటే లేదు

నెహ్రూ యువ కేంద్రంలో వార్షిక ప్రణాళిక ఊసే ఎత్తడం లేదు. యువతకు ఇచ్చే శిక్షణలు, చేపట్టే కార్య క్రమాలు, వచ్చిన బడ్జెట్ ఎంత తదితర వివరాలను కేంద్రంలోని నోటీస్ బోర్డ్‌పై ఉంచాలి. ఈ నిబంధనను పట్టించుకున్న వారే లేరు. నెహ్రూ యువ కేంద్రం ద్వారా గ్రామీణ యువజన సంఘాలకు చేరాల్సిన నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు పెడుతున్నారనే విమర్శలున్నాయి. జిల్లా అధికారులు నెహ్రూ యువ కేంద్రంపై దృష్టి సారించి ఎన్‌వైకేకు గత వైభవం తీసుకు రావాలని యువజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

యువజన సంఘాలను పట్టించుకోవడం లేదు

- మెతుకు హేమలత, హేమలత ఫౌండేషన్ అధ్యక్షురాలు



రిజిస్టర్ చేసుకొన్న సంఘాలకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదు. నెహ్రూ యువ కేంద్రం ద్వారా చేపట్టే కార్యక్రమాలకు యువజన సంఘాలకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు. గ్రామాల్లో యువజన కార్యక్రమాలను ప్రోత్సహం కరువైంది. ప్రత్యేకంగా మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించాలి..

- కొండ రవి, జాతీయ యువజన అవార్డ్ గ్రహీత



గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలను జిల్లా కేంద్రంలోని ప్రైవేటు విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్నారు. కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాల్లోనే నిర్వహించాలి. ప్రతి కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డు గ్రహీతలను భాగస్వాములను చేయాలి.

అందరినీ భాగస్వాములు చేయాలి

- సత్తినేని శ్రీనివాస్, రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత



యువజన, మహిళా సంఘాలను, అవార్డు గ్రహీతలను ఎన్‌వైకే కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలి. ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకలను గ్రామీణ ప్రాంతలకు చేరవేసేందుకు అందరి భాగస్వామ్యం అవసరం.

కలెక్టర్ చొరవ చూపాలి

- అనభేరి నితీషారావు, యువ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్



నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో యువజన సంఘాల పాత్ర చాలా కీలకమైనదీ. యువజన సంఘాలను, యువజన అవార్డు గ్రహీతలను భాగస్వామ్యం చేసే విధంగా కలెక్టర్ చొరవ చూపి సమావేశాలు నిర్వహించి యువజన కార్యక్రమాలను ప్రోత్సహించాలి.

రాళ్లవాగు కుడి కాలువకు మహర్దశ కలిగేనా?

● నేడు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల ఇరిగేషన్ ఈఎన్‌సీలతో ప్రభుత్వ విప్ సమీక్ష


రాళ్లవాగు కాలువలో అడ్డుగా ఉన్న పొదలు

కథలాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి) : రాళ్లవాగు ప్రాజెక్ట్ కుడి కాలువకు ఎప్పుడు మహర్దశ పడుతుందా అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. సోమవారం ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ ఇరిగేషన్ ఈఎన్‌సీలతో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ కాలువను పరిశీలించి సమీక్ష చేయనున్నారు. ఈ ప్రాజెక్ట్ నిజామాబాద్‌జిల్లా కమ్మరిపల్లి మండలంలోని కోనాపూర్ అడవుల్లో 2005లో అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా నిర్మించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా దాదాపు 3 వేలఎకరాల బీడు భూమిని సాగులోకి తెచ్చేందుకు నిర్మాణం చేశారు. జగిత్యాల జిల్లాలోని భూషణరావుపేట, కథలాపూర్, పెగ్గెర్ల, ఊట్‌పల్లి గ్రామాల్లోని భూములను సస్యశ్యామలం చేయడానికి నిర్ణయం చేశారు. అయితే కుడి కాలువ తూము నుంచి వచ్చే నీటితో పాటు పైభాగం నుంచి వచ్చే వరద నీటి ప్రవాహం కారణంగా ఏటా నక్కల ఒర్రె ప్రాంతంలో తెగిపోతుంది. ఇరిగేషన్ అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. కాలువ తెగిపోయి చివరి భూములకు నీరందని పరిస్థితి ఎదురవుతోందని రైతులు వాపోతున్నారు. ఎడమ కాలువ ద్వారా 164 ఎకరాలు, కుడి కాలువ ద్వారా 2700 ఎకరాల మేర సాగు కావాల్సి ఉంది.

● రెండు జిల్లాల అధికారుల సమన్వయం కరువు

ఈ కాలువ అటు ఆర్మూర్, ఇటు రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలో ఉండడంతో తెగిపోయిన సందర్భంలో రెండు జిల్లాల అధికారులు మరమ్మతుల కోసం అంచనాలు వేయాల్సి ఉంటుంది. దీంతో కాలయాపన జరిగి కాలువ మరమ్మతులకు నోచుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఐదు నెలల క్రితం నక్కల ఒర్రె వద్ద పడ్డ గండిని పూడ్చడానికి కమ్మర్‌పల్లి ఇరిగేషన్ అధికారులు రూ.21 లక్షలతో కల్వర్టు నిర్మించారు. అయితే అదే ప్రాంతంలో మళ్లీ భారీ గండి పడి నీరంతా వృథాగా పోయింది. మళ్లీ అంచనాలు వేయాలంటే రెండు ఉమ్మడి జిల్లాల అధికారులు సమన్వయం చేసుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. పలుమార్లు జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలోకి ప్రాజెక్ట్‌ను మార్చాలని రైతులు చేసిన విన్నపాలు పట్టించుకోవడం లేదు.

● సిమెంట్ లైనింగ్ వేయడమే శాశ్వత పరిష్కారం

తరచూ కాలువ తెగిపోతున్న క్రమంలో కాలువతో అవసరమున్న ప్రదేశాన్ని గుర్తించి శాశ్వతంగా సిమెంట్‌తో లైనింగ్ నిర్మాణం చేపడితేనే పరిష్కారం లభిస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఐదు పిల్ల కాలువలకుగాను 2010లో రెండు మాత్రమే నిర్మించారు. అయితే కాలువల్లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించకపోవడం వల్ల ఆ పనులు అటకెక్కాయి. నష్టపరిహారం చెల్లింపుతో పాటు కాలువకు శాశ్వత పరిష్కారం చూపించాలని రైతులు కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా వాహనాల పార్కింగ్

మల్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధిలో వాహనాలు పార్కింగ్ అస్తవ్యస్తంగా ఉందని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలకు తగినట్లు పార్కింగ్ ఏర్పాట్లు చేయకపోవడంతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గాలు ఇరువైపులా వాహనాలను నిలుపుతుండడంతో ట్రాఫిక్ జాం అయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఆదివారం ఉదయం వై జంక్షన్ ప్రాంతంలో మూడు మార్గాలకు అడ్డంగా వాహనాలు నిలిపి ఉంచడంతో వాహనాల రాకపోకలకు గంటల తరబడి భక్తులు అసౌకర్యానికి గురయ్యారు.


కొండగట్టు వై జంక్షన్ వద్ద రహదారులకు అడ్డంగా నిలిపిన వాహనాలు

ధాన్యం కుప్పను ఢీకొని ముగ్గురికి గాయాలు

వీణవంక, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్భాపూర్ గ్రామశివారులో ద్విచక్రవాహనం ధాన్యం కుప్పలను ఢీకొనగా ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్థుల వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పరకాల నుంచి ద్విచక్రవాహనంపై వీణవంక మండలం కోర్కల్‌గ్రామానికి కంచె కిరణ్, కంచెపావని, కూమారుడు రాఘవతో కలిసి వెళ్తున్నారు. ఈ క్రమంలో వరిధాన్యం కుప్పలు ఢీకోట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు108కి సమాచారం అందించగా వరంగల్ అసుపత్రికి తరలించారు. రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పలతో వారంలో ఇద్దరు మృతిచెందగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బీర్‌పూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓపాతఇంటిలో ఆరుగురు పేకాటరా యుళ్లను బీర్‌పూర్ ప్రొబేషనరీ ఎస్సై తన సిబ్బందితో దాడిచేసి పట్టుకున్నట్లు ఎస్సైతెలిపారు. వారి నుంచి 8,500రూపాయలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

గాజులపల్లిలో ఆరుగురు అరెస్టు..

మంథనిరూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపల్లి గ్రామశివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. డబ్బులు పెట్టి మూడు కమ్మల పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బావిలో పడి రెండు గేదెలు మృతి

రాయికల్, మే 18 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని చెర్లకొండాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు బావిలో పడి ఆదివారం రెండు గేదెలు మృతిచెందాయి. నానం సుమలత, ములాసపు మహేశ్వరీలకు చెందిన రెండు గేదెలు ఆదివారం మేత మేయటానికి గ్రామ శివారులోకి వెళ్లాయి. ఎండతీవ్రంగా ఉండటంతో సమీపంలోని బావి వద్దకు నీటిని తాగటానికి వెళ్లి అందులో పడి గేదెలు మృతిచెందాయి. గేదెల విలువ 80 వేల రూపాయల వరకు ఉంటుందని ప్రభుత్వం నష్టపరిహారం అందిచాలని బాధితులు కోరారు.

శిథిలావస్థలో ఎస్సారెస్పీ క్వార్టర్లు

- ప్రహరీ లేక ఆక్రమణలు
- దశాబ్దాల తరబడి నిరుపయోగం
- పట్టించుకోని పాలకులు


శిథిలావస్థకు చేరిన అధికారుల క్వార్టర్లు

సుల్తానాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ నడిబొడ్డులో ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు చెందిన ఆస్తులు నిరుపయోగంగా ఉన్నాయి. దశాబ్దాల తరబడి వాటిని అలాగే వదిలేయడం మూలంగా అధికారులు, ఉద్యోగుల, సిబ్బంది నివాసగదులు క్వార్టర్లు పలు కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. అక్కడక్కడ కూలిపోతున్నాయి. వీటిని ఎవరూ పట్టించుకోకపోవడంలేదు. వాటిని మరమ్మతులు చేయించడమో లేక కూల్చివేయమో చేసి భూములను కాపాడాల్సిన అవసరం ఉంది. లేదా శిథిలావస్థకు చేరిన క్వార్టర్లను బాగుచేసి ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు ఇస్తే బావుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులు, కుటుంబాలు ఇక్కడ నివాస ముంటూ ప్రభుత్వ క్వార్టర్లను దర్జాగా ఉపయోగించుకున్నారు.ఎస్సారెస్పీ భూములకు రక్షణ లేకుండా పోయింది. ప్రహరీ లేకపోవడం మూలంగా చుట్టు పక్కల కొంతభూములు ఆక్రమించుకుని నిర్మాణాలు చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి.

● కాలువల తవ్వకం కోసం క్యాంప్ ఏర్పాటు

సుల్తానాబాద్ ప్రాంతంలో శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు కాలువల నిర్మాణం పనులు ప్రారంభదశలో ఆ నిర్మాణాలు పర్యవేక్షించడం కోసం సుల్తానాబాద్ పట్టణంలోని నీరుకుళ్ల రోడ్డులో, డీ- 86 ప్రదాన కాలువకు సమీపంలో ఎస్సారెస్పీ ఇంజనీరింగ్ విభాగంతోపాటు పర్యవేక్షణ అధికారుల కోసం ఏకంగా ఇక్కడ ఒకక్యాంపును ఏర్పాటుచేశారు. ఈఈ మొదలుకొని పలువురు డీఈఈలు, ఏఈఈలు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది కోసం 1978లో క్వార్టర్లు ఆఫీసులు నిర్మించారు. ఓ మాదిరి కాలనీయే ఇక్కడ నిర్మించారు. వాటర్‌ట్యాంకు, తద్వారా అన్ని ఆఫీసులకు, క్వార్టర్లకు పైప్‌లైన్లు వేసి నేరుగా నల్లాలద్వారా నీటి సరఫరా ఏర్పాటు చేశారు. కాలనీ నలువైపులా చక్కటి రోడ్లను తీర్చిదిద్దారు. అందమైన మొక్కలు నాటి చెట్లను పెంచారు. ఒకపుడు సుల్తానాబాద్ పట్టణానికే ఈ ఎస్సారెస్పీ క్యాంప్ కొత్త కళ, శోభను తెచ్చింది.మొదట్లో అధికారులు, ఉద్యోగులు సిబ్బంది అందరూ ఈక్వార్టర్లలోనే నివాసం ఉండేవారు. కానీ ప్రస్తుతం ఎవరూ ఇక్కడ ఉండడం లేదు. కరీంనగర్ తదితర పట్టణాల నుంచిరాకపోకలు సాగిస్తూ విదులకు హాజరవుతున్నారు. దాంతో రానురాను నిర్వహణ, పర్యవేక్షణలు కొరవడి ఈ క్యాంపును పట్టించుకోవడమే మానేశారు.

● కేవలం నాలుగు మాత్రమే వినియోగంలోకి..

విశాలమైన ఆవరణలో నిర్మించిన ఎస్సారెస్పీ క్యాంపు ప్రస్తుతం కళావిహీనంగా మారింది. డివిజన్ కార్యాలయం అంటే ఎవరూ నమ్మని తీరులో ఉంది. ఆఫీసు ముఖద్వారమే చెత్త చెదారంతో, శిథిలావస్థకు చేరిన క్వార్టర్లుతో నిండి ఉంది. ప్రస్తుతం నాలుగు క్వార్టర్లను మాత్రమే వినియోగిస్తున్నారు. ఈఈ, డీఈఈ, రికార్డులతోపాటు మరో క్వార్టర్‌ను వినియోగిస్తున్నారు. అవి కూడా శిథిలావస్థకుచేరి ఉన్నవేకావడం గమనార్హం.. రాజుల సొమ్ములు రాళ్లపాలు అన్న చందంగా ప్రభుత్వ ఆస్తులు ఇలా నిరర్థకంగా పడి ఉండడాన్ని పలువురు గుర్తు చేసుకుంటూ ఆవేధన చెందుతున్నారు. భూముల ధరలు ఎక్కువగా ఉండడంతో ఈ భూములపై కన్నేసిన పలువురు వీటిని ఆ పేరుతో ఈ పేరుతో ఆక్రమించుకునే అవకాశాలు లేకపోలేదని పలువురు అంటున్నారు.

● ప్రహరీ నిర్మాణంతో ఆక్రమణలకు చెక్

- ఎస్సారెస్పీ ఈ ఈ ప్రసాద్

సుల్తానాబాద్ ఎస్సారెస్పీ క్యాంపు గురించి, ఇక్కడ నిరుపయోగంగా, శిథిలావస్థకు చేరి ఉన్న క్వార్టర్ల, ఆఫీసుల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాము. స్థలాన్ని అక్రమణకు గురికాకుండా చూడడానికి ముందు క్యాంపు చుట్టూ ప్రహరీని నిర్మించడానికి ప్రతిపాదనలు పంపించాము. ప్రహరీనిర్మాణం తర్వాత క్వార్టర్ల వినియోగం గురించి కూడా తగినచర్యలు తీసుకుంటాము. ఎవరు అక్రమణలకు పాల్పడ్డ చట్టరీత్యా చర్యలు తీసుకుంటాము. సుల్తానాబాద్ డివిజన్ పరిధిలోని పలుసబ్‌డివిజన్ కార్యాలయాలు కూడా తిరిగి యదాస్థానంలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.


కూలిపోతున్న క్వార్టర్లు

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

ముత్తారం మే 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ముత్తారం గ్రామ పంచాయతీకి చెందిన పింగిలిప్రమీల అనే వృద్ధురాలి మెడనుంచి గుర్తుతెలియని దొంగలు బంగారుగొలుసును అపహరించారు. ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలిని శనివారం రాత్రి సమయంలో తలుపుతట్టడంతో వృద్ధురాలు తమబంధువులని తలుపుతీసింది. ఒక్కసారిగా మెడలో ఉన్న గొలుసులాక్కొని వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. వృద్ధురాలికి గాయాలుకాగా స్థానికులుపోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. వృద్ధురాలు ఇచ్చిన ఫిర్యాదు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. త్వరలో దొంగలను పట్టుకొని కోర్టులో హాజరు పరుస్తామని ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

రేపటి నుంచి ఆర్జిత సేవలు రద్దు

మల్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): కొండగట్టులో మంగళవారం నుంచి గురువారం వరకు జయంతిఉత్సవాలు జరుగనుండగా ఆలయంలో ఆర్జితసేవలు నిలి పివేస్తున్నట్లు ఈవోశ్రీకాంత్‌రావు తెలిపారు. శుక్రవారం వరకు ఆర్జితసేవలు వాహనపూజలు, అభిషేకాలు, సత్యనారాయణవ్రతాలు ఉండవనిభక్తులు సహకరించాలని కోరారు. శనివారం నుంచి ఆర్జితసేవలు యథావిధిగా కొనసాగుతాయని ఈవో తెలిపారు.

కౌన్సెలింగ్‌తో వృద్ధుల కేసుల పరిష్కారం

జగిత్యాల అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను పోషించక నిరాధరిస్తున్న కొడుకులకు,కోడళ్లకు జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ కౌన్సెలింగ్ఇచ్చారు. ఈ సందర్భంగా వారు తల్లిదండ్రులను పోషిస్తూ వారిబాగోగులు చూసుకుంటామని ఒప్పంద పత్రం రాసి ఇచ్చినట్లు హరి అశోక్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా హరిఅశోక్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులను పోషించకుండా నిరాధరిస్తే రెవెన్యూడివిజనల్ అధికారి వయోవృద్ధుల ట్రిబ్యునల్ చైర్మన్ ఆరునెలలకు పైగా జైలుశిక్ష వేసే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రుల ఆస్తి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వాటిని తిరిగి స్వాధీనంచేసుకునే అవకాశం కలెక్టర్‌కు ఉందని ఆయన హెచ్చరించారు.

పోటెత్తిన భక్తజనం

- నాలుగో రోజు లక్షన్నర మంది పుణ్యస్నానాలు
- రద్దీగా మారిన రోడ్లు.. ఎట్టకేలకు వన్‌వే
- వారాంతపు సెలవుతో సందడిగా కాళేశ్వరం

కాళేశ్వరం, మే 18 (ఆంధ్రజ్యోతి): సరస్వతి నది పుష్కరాలకు ఆదివారం భక్తజనం పోటెత్తారు. పుష్కరతీరంతో పాటు కాళేశ్వరాలయం భక్తులతో కిటకిలాడాయి. వారాంతపు సెలవు కావడంతో కాళేశ్వరం పరిసరాలన్నీ ఆదివారం సందడిగా మారాయి. ఆదివారం మెయిన్ పుష్కరఘాట్‌లో సుమారు లక్షన్నర మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.

● బారులు తీరిన వాహనాలు

ఆర్టీసీతో పాటు ప్రైవేటు వాహనాలు భారీగా తరలిరావడంతో రహదారులు కిక్కిరిసి పోయాయి. 15కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. దికారులు భక్తుల రాకను అంచనా వేయడంలో విఫలమవుతుండడంతోనే ట్రాఫిక్ సమస్య ఏర్పడిందనే విమర్శలు వస్తున్నాయి. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు మొత్తం అటవీ ప్రాంతమవ్వడం.. అందులోనే 15 వరకు మూలమలుపులుండటంతో ట్రాఫిక్‌జాం అవుతోంది. దీంతొ అధికారులు వన్‌వేను ప్రారంభించారు. పుష్కరస్నానాలు పూర్తిచేసుకున్న వాహనాలను అన్నారం, దామెరకుంట, గంగారం గ్రామాల మీదుగా పంపిస్తున్నారు. రద్దీ తగ్గితే మళ్లీ పాత మార్గంలోనే వాహనాలకు అనుమతిస్తున్నారు.

● ప్రముఖుల దర్శనాలు

సరస్వతీ పుష్కరాల్లో భాగంగా పలువురు ప్రముఖులు పుష్కరస్నానం ఆచరించారు. పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామీతో పాటు సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్, హైకోర్టు జడ్జి సుధా దంపతులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పుష్కర స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయంలో కాళేశ్వర ముక్తీశ్వర స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



సినీ నటుడు రాజేంద్రప్రసాద్‌తో భక్తులు



కాళేశ్వరం ఆలయం వద్ద భక్తుల రద్దీ

● సాఫీగా సాగిన దర్శనాలు..

మూడు రోజులుగా దర్శనాలకు సాదారణ భక్తులు ఇబ్బందులు పడగా ఆదివారం సర్దుకుంది. దేవాదాయ శాఖ అధికారులు దర్శనాలకు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో దర్శనాలు సాఫీగా సాగాయి. క్యూలైన్ల వద్ద, ప్రధాన గోపురం వద్ద సిబ్బంది పర్యవేక్షించారు.

● ఆలయానికి వెళ్లేందుకు ఇబ్బందులు

పుష్కరాలకు వచ్చిన భక్తులకు దర్శన తిప్పలు తప్పడం లేదు. తాత్కాలిక ఆర్టీసీ బస్టాండు నుంచి పుష్కరఘాట్‌కు ఉచిత బస్సులు, ప్రైవేటు వాహనాలతో భక్తులకు వెళ్లేందుకు సదుపాయాలు కల్పించగా అక్కడి నుంచి ఆలయానికి వెళ్లేందుకు ఎలాంటి ఏర్పాట్లు లేవు. దీంతో భక్తులు ఇబ్బందిపడుతున్నారు.

● అందుబాటులోకి ఏరియల్ రైడ్..

సరస్వతి పుష్కరాల సందర్భంగా భక్తులు విహంగ వీక్షణం చేసేందుకు ఏరియల్ రైడ్ అందుబాటులోకి తెచ్చారు. ఆదివారం నుంచి పుష్కరఘాట్ మార్గంలోని హెలిప్యాడ్ నుండి రైడ్స్‌ను ప్రారంభించారు. ఒక్కో భక్తుడు .4500 రూపాయలు చెల్లించి కాళేశ్వరాలయంతో పాటు త్రివేణి సంగమ పరిసరాలను జాయ్‌రైడ్స్‌లో చూపించనున్నారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోను ఈరైడ్స్‌కు టికెట్ బుక్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.



కాళేశ్వరంనకు వెళ్లేదారిలో బారులు తీరిన వాహనాలు



గోదావరికి హారతి ఇస్తున్న భక్తులు

జయంత్యుత్సవాలకు కొండగట్టు ముస్తాబు

మల్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలకు కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం ముస్తాబు అవుతోంది. సోమవారం సాయంత్రం ఉత్సవాలకు ఆలయ అర్చకులు అంకురార్పణ కార్యక్రమాలు చేపట్టనుండగా మంగళవారం నుంచి స్వామి సన్నిధిలో హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల కోసం అంజన్న ఆలయంతో పాటు ఉప ఆలయాలకు రంగులు వేశారు. ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే త్రయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞంకు యాగశాలను సిద్ధం చేశారు. దిగువ కొండగట్టు, దొంగలమర్రి-జేఎన్‌టీయూ మార్గంలో, కొండపైన స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. ప్రతియేటా నిర్వహించే హనుమాన్ పెద్ద జయంతిని ఈసారి అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజులపాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి లక్షలాదిగా అంజన్న దీక్షాపరులు, భక్తులు కొండగట్టుకు చేరుకోనున్నారు. ఆలయానికి లైటింగ్ పనులు జరుగుతున్నాయి.



లడ్డూలు తయారు చేస్తున్న సిబ్బంది



వైజంక్షన్ ప్రాంతం నుంచి ఏర్పాటు చేస్తున్న పందిళ్లు

● అధికారుల పర్యవేక్షణ

కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో జరిగే హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలకు గాను భక్తులకు ఇక్కట్లు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. కొండపైకి వచ్చే భక్తులు అసౌకర్యానికి గురి కాకుండా ఏర్పాట్లపై ఇప్పటికే ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ జిల్లా స్థాయి అధికారులు, దేవస్థానం అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. వందలాది పోలీసులచే బందోబస్తుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వందేళ్ల సంబరం..

- వృద్ధురాలికి నూరేళ్ల పుట్టిన రోజు
- కుటుంబ సభ్యుల అనుబంధాన్ని చాటిన వేడుక

గంభీరావుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలకేంద్రంలో మెల్ల రామవ్వ అనే వృద్ధురాలి 100వ పుట్టిన రోజు సంబరాలను కుటుంబసభ్యులు ఘనంగా నిర్వహించారు. రామవ్వకు ఆదివారంతో 100ఏళ్ల నిండాయి. మండల కేంద్రంలోని ముదిరాజ్ ఫంక్షన్ హాల్‌లో కుటుంబ సభ్యులు అందరూ ఒకచోట చేరి రామవ్వతో కేక్ కట్ చేయించారు. ఆటా పాటలతో సాగిన ఈ వేడుక కుటుంబ సభ్యుల అనుబంధాన్ని చాటి చెప్పింది. కార్యక్రమంలో రామవ్వ కుమారులు, కుమార్తెలు, కోడళ్లు, అల్లుళ్లు, మనవలు, మనవరాళ్లు, మునిమనవలు, మునిమనవరాళ్లు సమష్టిగా నిర్వహించారు. దాదాపు రామవ్వకు ముగ్గురు కొడుకులు, నలుగురు కూతుళ్లు కాగా, మొత్తం కుటుంబ సభ్యులు 70 మంది వరకు ఉన్నారు.



100 ఏళ్ల పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న రామవ్వ

కొండగట్టులో భక్తుల సందడి



కొండగట్టు ఆలయం ముందు భక్తులు

మల్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ నది పుష్కరాల నేపథ్యంలో కొండగట్టు అంజనేయస్వామి సన్నిధిలో పుష్కర భక్తులతో కోలాహలం నెలకొంది. కాళేశ్వరంలోని సరస్వతీ నది పుణ్యస్నానాలకు వెళ్తున్న భక్తులు, తిరిగి వస్తున్న భక్తులు మార్గమధ్యంలోని కొండగట్టు అంజన్నను దర్శించు కుంటున్నారు. దీంతోరెండురోజులుగా కొండగట్టు భక్తులతో రద్దీగా మారింది.

గోపాలమిత్రల గోడు పట్టేదెవరికి?

- వేతనాలు అందక ఇబ్బందులు
- ఎనిమిది నెలలుగా పెండింగ్
- రాష్ట్రంలో 1,530 గోపాలమిత్రలు



జగిత్యాల జిల్లా గొల్లపల్లిలో పశువులకు టీకాలు ఇస్తున్న గోపాలమిత్రలు

జగిత్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): పశు సంవర్ధక శాఖలో పనిచేస్తున్న గోపాల మిత్రల గోడు పట్టించుకునే వారు లేకుండా పోయారు. పశు పోషకులకు సహాయ సహకారాలు అందించే ందుకు పశువైద్య శాలల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన గోపాల మిత్రలకు ఎనిమిది నెలలుగా వేతనాలు అందడం లేదు. వచ్చే అరకొర వేతనం సైతం సకాలంలో అందకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. కుటుంబ పోషణ భారంగా మారుతుండడంతో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారు.

● పశువైద్యంలో కీలకపాత్ర

పశు సంవర్ధక శాఖలో గోపాల మిత్రలు కీలకపాత్ర పోషిసున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1530 మంది గోపాల మిత్రలుండగా, జగిత్యాల జిల్లాలో 22 మంది పనిచేస్తున్నారు. పశువులకు కృతిమ గర్భధారణ చేయడంతో పాటు మేకలు, గొర్రెలకు ప్రాథమిక వైద్య అందిస్తుంటారు. అదే విధంగా పశువులకు వాక్సినేషన్లు వేయడంలో, కృతిమ గర్భధారణ లక్ష్యాలు నెరవేర్చడంలో గోపాలమిత్రలు కీలకంగా వ్యవహరిస్తుంటారు. పశువుల సంఖ్య మేరకు గోపాలమిత్రలకు కృతిమ గర్భధారణ టార్గెట్లు నిర్ణయిస్తున్నారు. ఒక్కో గోపాలమిత్రకు నెలకు వంద కృతిమ గర్భాధారణ చేయాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులు సహజ గర్భధారణకు ప్రాధాన్యం ఇస్తుంటారు. దీంతో గోపాల మిత్రలు టార్గెట్లు పూర్తి చేయడంలో ఇక్కట్లు ఎదుర్కొం టున్నారు. కొన్ని సందర్భాల్లో టార్గెట్లు రీచ్ కాలేందటూ గౌరవ వేతనాల్లో కోత విధిస్తున్నారని గోపాలమిత్రలు వాపోతున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్య తీసుకవెళ్లినా ఫలితం ఉండడం లేదంటున్నారు.

● ఎనిమిది నెలలుగా వేతనాలు పెండింగ్

గోపాల మిత్రలకు ఒక్కొక్కరికి నెలకు రూ. 11,050 గౌరవ వేతనంగా ప్రభుత్వం చెల్లిస్తోంది. 2024 సెప్టెంబరు నుంచి 2025 ఏప్రిల్ వరకు ఎనిమిది నెలల గౌరవ వేతనం అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఎనిమిది నెలలకు పైగా చిల్లిగవ్వ చేతికి రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారి ఇబ్బందుల పాలవుతున్నారు. ఇచ్చే అరకొర వేతనాల్లో కోతలు విధిస్తుండడం, నెల నెలా చెల్లించకపోవడంతో అప్పు చేస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

- వేములవాడ గంగారం, గోపాలమిత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు, జగిత్యాల



పశు సంవర్ధక శాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రలకు రావాల్సిన తొమ్మిది నెలల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. ఏ నెలకు ఆ నెల గౌరవ వేతనం అందేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి. ఇచ్చే అరొకర వేతనాలు ఎప్పటికప్పుడు అందకపోవడంతో అవస్థల పాలవుతున్నాం.

ఇబ్బందులు పడుతున్నాం

-చెరుకు శ్రీనివాస్, గోపాలమిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,



పశు సంవర్ధకశాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రలకు సక్రమంగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నాం. మా కష్టానికి తగ్గట్టుగా వేతనాలు ప్రతినెలా చెల్లించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.

బడ్జెట్ విడుదల కావాల్సి ఉంది

- డాక్టర్ కె. వేణుగోపాల్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, జగిత్యాల



గోపాలమిత్రలకు అందించే గౌరవ వేతనాల బడ్జెట్ విడుదల కావాల్సి ఉంది. జిల్లాలో పనిచేస్తున్న గోపాలమిత్రల వివరాలను ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు పంపుతున్నాం. బడ్జెట్ కేటాయిస్తే వారి బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ అవుతాయి.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- దర్శనానికి రెండు గంటల సమయం
- రాజన్న సేవలో మహానాథ్ మహేంద్ర దాస్‌జీ

వేములవాడ కల్చరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు రాజన్న కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకుని ఆయాక్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్నారు. రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు సుమారుగా రెండు గంటలపాటు క్యూలైన్‌లో బారులుతీరి రాజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులకు తలెత్తకుండా ఆల యాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిం చారు.



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

రాజన్న సేవలో అయోధ్య లవకుశ జన్మభూమి తీర్థక్షేత్ర అధ్యక్షుడు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని అయోధ్యలవకుశ జన్మభూమి తీర్థక్షేత్ర అధ్యక్షుడు మహానాథ్ మహేంద్రదాస్‌జీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం అద్దాలమండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.



రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న మహానాథ్ మహేంద్ర దాస్‌జీ

ఆలయ పునరుద్ధరణ పనులకు మోక్షమెప్పుడో?

- వెనక్కి వెళ్లిన నిధులు.. నిలిచిన పనులు..
- రెండేళ్లుగా బాలాలయంలోనే పూజలు
- ఇబ్బందులు పడుతున్న భక్తులు

ఎల్లారెడ్డిపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను మోక్షం కలగడం లేదు. మంజూరైన నిధులు మళ్లిపోవడంతో ఆలయ నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. వేణుగోపాలుడి దర్శన భాగ్యం ఎప్పుడు కలుగుతుందోనని భక్తులు ఎదురుచూస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు పట్టించుకోకపోవడం వల్ల స్వామివారికి బాలాలయంలోనే పూజలు అందుతున్నాయి. ఇరుకైన బాలాలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ప్రతియేటా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నిధులు మంజూరై భూమి పూజ చేయడంతో స్వామివారి సేవలో తరించవచ్చని భక్తుల్లో నెలకొన్న ఆశలు ఆదిలోనే ఆవిరయ్యాయి. నిత్య భజనలతో కళకళలాడాల్సిన ఆలయం కూలిపోయిన మట్టి గోడల మధ్య మిగిలిపోయింది. స్వామి వారి దర్శన భాగ్యం కోసం భక్తులు వేయి కన్నులతో ఎదురు చూస్తున్నారు.



వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణం

గత వైభవం కోల్పోయిన ఆలయం

మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయానికి 400 ఏళ్లనాటి చరిత్ర ఉంది. నిత్య పూజలు, భజనలతో వైభవంగా అలరారేది. బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేవారు. పురాతన ఆలయం కావడంతో శిథిలావస్థకు చేరుకుందని పేర్కొంటూ రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అప్పటి మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో రూ.1.80 కోట్లను టీటీడీ శ్రీవాణి ట్రస్టు నుంచి నిధులు మంజూరయ్యాయి. 2023లో ఆలయ పునర్నిర్మాణ పనులను కేటీఆర్, అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిలు కలిసి భూమిపూజ చేశారు. పనులు చేపట్టడంతో స్వామివారికి నిత్య పూజలు అందించడానికి ఆగమశాస్త్రం ప్రకారం స్థానిక శివాలయం పక్కన తాత్కాలిక రేకుల షెడ్డు వేసి ఉత్సవమూర్తులను ఉంచారు. మంజూరైన నిధుల విడుదలకు 10 శాతం ప్రజా వాటా చెల్లించాలని టీటీడీ శ్రీవాణీ ట్రస్టు స్పష్టం చేయడంతో అయోమయం నెలకొంది. డబ్బులు ఎక్కడినుంచి తీసుకురావాలని ఆలయ కమిటీ ఆలోచనలో పడింది. గడువు తీరిపోవడం వల్ల మంజూరైన నిధులు మరలిపోయాయి. దాంతో పనులు నిలిచిపోయాయి. నిధుల కోసం ఆలయ కమిటీ సభ్యులు ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారుల వద్దకు వెళ్లినా ఫలితం లేకుండాపోతోంది. దాంతో చేసేదేమి లేక బాలాలయంలోనే నిత్య పూజలతో నెట్టుకొస్తున్నారు.

ఉత్సవాలకు ఇబ్బందులు

ప్రతి యేటా కార్తీక మాసంలో వేణుగోపాలస్వామి ఆలయ బ్రహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేవారు. పురాతన ఆలయ గోడలు తొలగించి తాత్కాలిక రేకుల షెడ్డులోని బాలాలయంలో స్వామివారికి పూజలు చేస్తున్నారు. వారంరోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగే బ్రహోత్సవాలకు ఇబ్బందులు తప్పడంలేవు. స్థలలేమి వల్ల నామమాత్రం పూజలతో స్వామివారి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, దేవాదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వేణుగోపాల స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు నిధులు కేటాయించి పనులను చేపట్టేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

ఆలయ పనులు చేపట్టాలి

- ద్యాగం రాములు, భక్తుడు



పురాతన ఆలయంలో నిత్యం స్వామివారిని దర్శించుకునేవాడిని. శిథిలావస్థకు చేరడం వల్ల కొత్త ఆలయాన్ని నిర్మిస్తారంటే సంతోషించాం. గోడలను కూల్చివేసి పనులకు భూమిపూజ చేసి రెండేళ్లు అవుతోంది. డబ్బులు వాపసు వెళ్లాయని వదిలేశారు. బాలాలయంలో స్వామికి పూజలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరుచేసి పనులను వేగవంతం చేయాలి. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించేలా చూడాలి.

బాలాలయంలో పూజలు..

- నవీన్‌చారి, అర్చకుడు



వేణుగోపాలస్వామి ఆలయం పునర్నిర్మాణానికి నిధులు మంజూరవడం వల్ల సంతోషం కలిగింది. రెండేళ్ల కిందట పనులకు శ్రీకారం చుట్టడంతో భక్తులకు స్వామివారి దర్శనం కలుగుతుందని భావించాం. స్థానిక శివాలయం పక్కన తాత్కాలిక రేకుల షెడ్డును నిర్మించి ఉత్సవమూర్తులకు నిత్య పూజలు నిర్వహిస్తున్నాం. బ్రహ్మోత్సవాల సమయంలో కాస్త ఇబ్బందిగా మారుతోంది.ఆలయ పునర్నిర్మాణానికి నిధులు మంజూరుకు ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలని కోరుతున్నాం.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

కోనరావుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి ప్రభాకర్ మాట్లాడుతూ బీహార్ రాష్ట్రం దర్భాంగలో దళిత విద్యార్థులను రాహుల్‌గాంధీని కలవనీయకుండా అడ్డుకోవడాన్ని నిరసిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వెంకటేష్, దినేష్, నవీన్, వినయ్, జనార్ధన్, వేణు, రెడ్డి, శేషు, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామంలో ఆర్మీ జవాన్‌కు ఘన స్వాగతం



ఆర్మీ జవాన్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

ఇల్లంతకుంట, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని తొలిసారి స్వగ్రామానికి వచ్చిన ఆర్మీ జవాన్ అంతటి అనీల్‌కు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. మండల కేంద్రానికి చెందిన అంతటి అనీల్ జమ్మూ సెక్టార్‌లో పనిచేస్తున్నాడు. యుద్ధ సమయంలో అక్కడే విధులు నిర్వహించి ఆదివారం ఇంటికి వచ్చాడు. గ్రామ సమీపంలో గౌడ కుల సంఘ నాయకులు, గ్రామస్థులు కలిసి అభినందనలు తెలిపారు. బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘ అధ్యక్షుడు కొయ్యడ రాజయ్య, నాయకులు ఒగ్గు నర్సయ్యయాదవ్, కూనబోయిన బాలరాజు, కొయ్యడ భాస్కర్, ఉప్పల అమరేందర్, భూమల్ల అనీల్‌కుమార్, ఏగుర్ల శ్రీనివాస్, నాగసముద్రాల సంతోష్, మామిడి తిరుపతి, మ్యాకల మల్లేశం, బోనగిరి రాము, కాసుపాక కిషన్‌లతో పాటు గౌడ సంఘ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వనం నుంచి జనంలోకి..



గంభీరావుపేటలోకి వచ్చిన నెమలి

గంభీరావుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి) : వన్యపాణులు వనం నుంచి జనంలోకి వస్తున్నాయి. వన్యప్రాణులు తరచూ ఊళ్లలోకి వస్తున్నాయి. అడవుల్లో తాగేందుకు నీరు దొరక్కనే సమీప గ్రామాల్లోకి వన్యప్రాణులు వస్తున్నట్టు తెలుస్తోంది. తాజాగా ఆదివారం కూడ గంభీరావుపేటలోని ఎల్లమ్మ కాలనీలో కూడా వన్యప్రాణి నెమలి ఓ ఇంటి బంగ్లాపై ఎక్కడంతో అందరూ ఆశ్చర్యంగా చూడసాగారు.

ఏడాదిన్నర కాలంలోనే కాంగ్రెస్ పాలన విఫలం

- కేటీఆర్ సేన మండల అధ్యక్షుడు భాస్కర్ గౌడ్

తంగళ్లపల్లి, మే 18 (ఆంధ్రజ్యోతి): అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాదిన్నర గడవకముందే అన్ని రంగాల్లో విఫలమైందని కేటీఆర్ సేన మండల అధ్యక్షుడు నందగిరి భాస్కర్ గౌడ్ విమర్శించారు. ఆదివారం కేటీఆర్ సేన మండల అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో బస్వాపూర్, రామన్న పల్లెలో కేటీఆర్ సేన గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో పంటలకు సాగునీళ్ల సమృద్ధిగా అందయన్నారు. ప్రస్తుతం రైతులకు పంట పొలాలకు నీరు అందక ఎండిపోయాయని ఆరోపించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ సీనియర్ నేతలు కర్నె బాలయ్య, తాటిపాముల శ్రీనివాస్, సత్తు రాంరెడ్డి, పుర్మాని లక్ష్మారెడ్డి, మోతే మహేష్, సత్తు వెంకటరెడ్డి, తిరుపతి, మల్లయ్య, ఆత్మకూరి రంగయ్య యాదవ్, ఆత్మకూరి శ్రీనివాస్, ఆత్మకూరి చంటి యాదవ్, శ్రీశైలం, మల్లయ్య, మందాటి శ్రీనివాస్, సాయిరాం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

కోనరావుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం కనగర్తి శివారులోని కనకదుర్గ రైస్‌మిల్ వద్ద విద్యుత్ షాక్ తగిలి పాడి ఆవు మృతిచెందింది. కనగర్తి గ్రామానికి చెందిన స్వామిదాసు అనే రైతుకు చెందిన ఆవు మేస్తూ కింది భాగంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో షాక్ తగిలి మృతిచెందింది. దీంతో రూ.50 వేల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు.

జిల్లా కేంద్రంలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు

- 6 ఎకరాల్లో 2 వేల మంది క్రీడాభిమానులు కూర్చుండేలా ఏర్పాట్లు - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



బౌలింగ్ చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



బ్యాటింగ్ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ క్రీడాకారులు, విద్యార్థులకు అందుబాటులో ఉండేలా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం మానేరు వాగు బతుకమ్మ ఘాట్ పక్కన ఉన్న మైదానాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పరిశీలించారు. క్రికెట్ క్రీడాకారులతో కలసి ఆటవిడుపుగా క్రికెట్ ఆడారు. కలెక్టర్ బౌలింగ్ వేయగా ప్రభుత్వ విప్ బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో జోష్ నింపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడారు. గత ప్రభుత్వంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయలేకపోయిందని క్రీడాకారులు, క్రీడాభిమానులు తన దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. ప్రజా ప్రభుత్వంపై నమ్మకం ఉందని క్రీడా మైదానం ఇవ్వాలని కోరారని తెలిపారు. సిరిసిల్ల పట్టణంలో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చామని, సిరిసిల్ల పట్టణానికి అనుకునే ఉండే విధంగా క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి స్పోర్ట్స్ యూనివర్సిటీని వందల ఎకరాలలో ఏర్పాటు చేస్తున్నారన్నారు. పేదల భూములకు నష్టం లేకుండా క్రికెట్ స్టేడియం నిర్మాణం జరుగుతుందన్నారు. దాదాపు 6 ఎకరాలలో 2వేల మంది క్రీడాభిమానులు కూర్చుండే విధంగా స్టేడియం ఏర్పాటు చేసుకోవడానికి అధికారులు, క్రీడా నైపుణ్యాల సలహాలతో నిర్మాణం చేపడుతామన్నారు. క్రికెట్ స్టేడియం నిర్మాణానికి మొదటి అడుగు వేస్తున్నామని, పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. క్రీడా కార్యక్రమాల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో సిరిసిల్ల మానేరు వాగు సమీపంలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ నాగుల సత్యనారాయణ, ఆర్డీవో వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దుబాల వెంకటేశం, ఎండీ ఖాజా, ఆడెపు జగన్, నక్క నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, కుడిక్యాల రవికుమార్, వేముల రవి, వెంగళ లక్ష్మీనర్సయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ప్రతిష్ఠ మహోత్సవాల్లో కేటీఆర్



కోళ్లమద్దిలో మల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్న కేటీఆర్

గంభీరావుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండలం కోళ్లమద్ది గ్రామంలో ఆదివారం మల్లికార్జున స్వామి ప్రతిష్ఠ మహోత్సవాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు పాల్గొన్నారు. కోళ్లమద్దిలో మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈనెల 12 నుంచి కొనసాగుతున్నాయి. కేటీఆర్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, మాజీ సర్పంచ్ కేశవరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, కొత్తపల్లి సింగిల్ విండో చైర్మన్ సురేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దయాకర్‌రావు, రాజారాం, లక్ష్మణ్ లింగంయాదవ్, యాదవ సంఘం అధ్యక్షుడు అంజయ్య తదితరులు ఉన్నారు. అలాగే పెద్దమ్మ ఆలయంలో కేటీఆర్ ప్రత్యేక పూజలు చేశారు.

● సిరిసిల్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ ఆదివారం పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు. కేటీఆర్ అందరిని పలకరిస్తూ దంపతులను ఆశీర్వదించారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో సమ్మెట పర్శరాములు కూతురు వివాహంతో పాటు కె కన్వెన్షన్‌లో మాట్ల మధు సోదరుడు ప్రణయ్, లహరి గార్డెన్‌లో సొల రాజం కుమారుడు శ్యాం వివాహ వేడుకల్లో పాల్గొన్నారు.

ఆయన వెంట నాస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అకునూరి శంక రయ్య, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, బీఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, కుంభాల మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్ గ్రామాల్లో జరిగిన పలు శుభకార్యాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ఆదివారం హాజరయ్యారు. నాస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, నాయకులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు. పలు శుభకార్యాల్లో కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి తదితరులు పాల్గొని అశీస్సులు అందించారు.

అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్షాల విమర్శలు..



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి

రుద్రంగి, మే 18 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగిలో జరుగుతున్న అభివృద్ధి చేసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు విమర్శలు చేస్తున్నారని మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16న మంత్రుల పర్యటనలో భాగంగా మంత్రుల భద్రతలో దృష్టా హెలిప్యాడ్ సమీపంలో ధాన్యంపై ఉన్న టార్పాలిన్ కవర్‌లు హెలిక్యాప్టర్ గాలికి లేచిపోయె ప్రమాదం ఉన్నందున ముందస్తుగా అక్కడ ఉన్న ధాన్యం కొనుగోలు చేశామని, దీనిని కావాలని ప్రతిపక్ష నాయకులు మంత్రులు వస్తేనే కొనుగోలు చేస్తారా అనడం సరైంది కాదన్నారు. ఇప్పటివరకు డీసీఎంఎస్ ద్వారా 72 లారీలు, ప్యాక్స్ సెంటర్‌లో 80 లారీల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. సుమారు 30 శాతం ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని, మూడు, నాలుగు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. వర్షాల కారణంగా ధాన్యం కొనుగోలు ఆలస్యం జరిగిందని రైతులు గమనించాలని కోరారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో లారీల కొరత లేకుండా వేగంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.

ఈ సమావేశంలో తర్రె మనోహర్, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గండి నారాయణ, తర్రె లింగం, మాడిశెట్టి అభిలాష్, గండి అశోక్, దయ్యాల శ్రీనివాస్, ఎర్రం అరవింద్, అక్కనపల్లి శ్రీనివాస్, సునీల్, ద్యావల దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

మడేలేశ్వర స్వామిని దర్శించుకున్న బీఆర్ఎస్ నేతలు



మడేలేశ్వర స్వామిని దర్శించుకుంటున్న బీఆర్ఎస్ నేతలు

వేములవాడ రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రూరల్ మండల ఫాజుల్‌నగర్ గ్రామంలో నిర్వహిస్తున్న శీతలదేవి సమేత మడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనర్సింహారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డిలు హాజరయ్యారు. ఆలయానికి వీచ్చేసిన వారికి ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గొస్కుల రవి, దేవరాజం, గడ్డం హన్మాండ్లు, ఏశ తిరుపతి, వేణు, యామ తిరుపతి తదితరులు ఉన్నారు.

కరాటే క్లాసులను సద్వినియోగం చేసుకోవాలి

ఇల్లంతకుంట, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచితంగా కరాటే శిక్షణ ఇస్తున్నట్లు కరాటే మాస్టర్ పసుల బాలరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో జరిగే శిక్షణా కార్యక్రమాలు ఉదయం, సాయంత్రం ఉంటాయని విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బెల్ట్‌షాపులను అరికట్టడంలో ప్రభుత్వ విఫలం

ఇల్లంతకుంట, మే 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో రోజురోజకు పెరుగుతున్న మద్యం బెల్ట్‌షాపులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం చెందిందని ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ సావనపెల్లి రాకేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు బెల్ట్‌షాపులు అరికడతామని పేర్కొన్న నాయకులు అధికారంలోకి వచ్చాక విస్మరించారని పేర్కొన్నారు. విచ్చలవిడిగా మద్యం దుకాణాలు ఉండటంతో కూలీ పని చేసే వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయని పేర్కొన్నారు. గ్రామాల్లోని బెల్ట్‌షాపులు మూసివేసే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు.

అనంతారంలో ఉచిత వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

ఇల్లంతకుంట, మే 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతారం గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతం అయ్యింది. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత గుండె వైద్యశిబిరం కొనసాగింది. వైద్యశిబిరంలో 150మందికి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడికవర్ సెంటర్‌హెడ్ గుర్రం కిరణ్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘ అధ్యక్షుడు చొప్పరి రామచంద్రం, నాయకులు లక్ష్మన్, కోట కర్ణాకర్, లక్ష్మీరాజం, శ్రీకాంత్‌లతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి సహాయం

సిరిసిల్ల టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): కాలి గాయంతో మరణించిన భవన నిర్మాణ కార్మికుడు వెంగళ నవీన్ కుటుంబానికి సహాయం చేయడానికి ఆదివారం పలువురు ముందుకువచ్చారు. బీఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి రూ.3000, బీఆర్ఎస్ నాయకుడు వేముల హరికృష్ణ రూ.2000, సామాజిక కార్యకర్త వేముల మార్కండేయులు రూ.500 ఆర్థిక సహాయం అందించారు. మృతుడి ముగ్గురు కూతుళ్లను హాస్టల్లో ఉంచి విద్య నందిస్తామని వేముల మార్కండేయులు ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. ఆదేవిధంగా భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు కడారి రాములు 25 కిలోల బియ్యంతో పాటు నెలరోజులు సరిపడే నిత్యావసర సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, నాయకుడు చేరాల రవి పాల్గొన్నారు.

'అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ గ్యారెంటీలపై లేదు'

సిరిసిల్ల టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందాల పోటీపై ఉన్న శ్రద్ధ ఆరు గ్యారెంటీలపై లేదని బీఆర్ఎస్ నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజాపాలన పేరుతో ప్రజలను మోసం చేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలు చేస్తుందని రైతులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఆరుగాలం పండించిన ధాన్యం అకాల వర్షాలతో తడవడంతో రైతాంగం నష్టపోతుందని ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు మట్టి శ్రీనివాస్, కోడం వెంకటేష్, అఫ్రోజ్, అజ్జు, భానుకిరణ్, రాజు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

ఇల్లంతకుంట, మే 18 (ఆంధ్రజ్యోతి): వ్యాపారవేత్త కందికట్కూర్ గ్రామానికి చెందిన తుమ్మనపల్లి వెంకటేశ్వరరావు బీజేపీలో చేరారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదివారం ఇల్లంతకుంటకు రాగా ఆయన సమక్షంలో వెంకటేశ్వరరావు పార్టీలో చేరారు. మండలంలో బీజేపీ అభివృద్ధికి కృషి చేయాలని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు భూమల్ల అనిల్‌కుమార్, నాయకులు భూమల్ల ప్రశాంత్, చదువల్ల శ్రీధర్, చదవల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

సూర్యుడి భగ భగలు..

- చెరుకు రసంతో జనాలు ఉపశమనం



చెరుకు రసం తయారుచేస్తున్న వ్యాపారి

సిరిసిల్ల టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో సూర్యుడి భగ భగలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతూ వస్తుండడంతో ప్రజలు ఉదయం 10గంటల అయిందంటే గృహాలు విడిచి బయటకు రావడాకి భయపడుతున్నారు. తప్పని పరిస్థితులు ఉంటేనే సామాన్య ప్రజలు బయటకు వస్తున్నారు. ఎండలను తట్టుకోవడం కోసం ప్రజలు శీతల పానీయాల వైపు దృష్టి సారిస్తున్నారు. తక్కువ ధరలో లభించే చెరుకు రసాన్ని తీసుకుంటున్నారు. జిల్లాకేంద్రంలో పాత బస్టాండ్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, గాంధీచౌక్, కొత్త బస్టాండ్ ప్రాంతాలలో ఎక్కువగా చెరుకు రసం దుకాణాలు వెలిశాయి. చెరుకు రసం విక్రయదారులు ఆధునిక యంత్రాలతో చెరుకు రసం తయా రుచేసి అందిస్తున్నారు. చెరుకు రసంతో ఆరోగ్యకర ప్రయోజనాలు..

● చర్మం ముడతలు పడకుండా, మొటిమలు రాకుండా నివారిస్తుంది.

● సుక్రోజ్ చక్కెర ఉండడంతో తాగిన వెంటనే శక్తి సమకూరుతుంది.

● చెరుకు రసం తాగడం వల్ల శరీరంలోని విష పదార్థాలు బయటకు పోతాయి. ఫ్లావాయిడ్స్ ప్రోస్టేట్ రొమ్ము క్యాన్సర్లను నివారిస్తుంది.

● కాల్షియం ఎక్కువగా ఉండడంవల్ల ఎముకలు శక్తివంతం అవుతాయి.

● చెరుకులో ఉండే యాంటీఆక్సిడెంట్లు అనేక వైరస్ బాక్టీరియా రోగాల నుండి మనిషిని కాపాడుతాయి.

● చెరుకు రసం, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు కలిపి తాగితే మూత్ర సంబంధిత వ్యాధులతో పాటు ఇన్ఫెక్షన్లను తగ్గుతాయి.